


భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 39.0
కనిష్ఠం: 28.0



పట్టుబడిన బియ్యం లారీలు (ఫైల్ ఫొటో)

కాకినాడ పోర్టు.. వయా నరసాపురం

కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా

గత ప్రభుత్వ హయాంలో చీకటి దందా

ఇంకా అదే తీరు

నరసాపురం, జూన్ 20: గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన రేషన్ బియ్యం అక్రమ రవాణకు ఇంకా చెక్ పడలేదు. ప్రభుత్వం మారినా ఇంకా చీకటి దందా కొనసాగుతూనే ఉంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి రాత్రి సమయాల్లో బియ్యం లారీలు యథేశ్చగా జిల్లా సరిహద్దు దాటి కాకినాడకు వెళ్లిపోతున్నాయి. అక్కడ నుంచి పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా వైసీపీ పార్టీకి చెందిన ఓ మాజీ నేత కనుసన్నల్లోనే ఇంకా సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తెల్లకార్డు దారులకు ఉచితంగా 20 కేజీల రేషన్ బియ్యం అందించింది. దాదాపు ఏడాది పాటు ఈ బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో మాదిరిగానే రేషన్ బియ్యం ఇచ్చింది. అయితే ఎక్కువమంది ఈ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడలేదు. బయట మార్కెట్‌లో అమ్ముకున్నారు. వాటిని కొంతమంది బ్రోకర్లు కొనుగోలు చేసి కాకినాడకు తరలించారు.మొదట్లో అంతా రైస్ మిల్లర్లకు తరిస్తున్నారని భావించారు. అయితే అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో లారీలు జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మీదుగా చించినాడ మీదుగా కోనసీమకు వెళ్లాయి. ఈ దందా అంతా రాత్రి సమయాల్లోనే సాగింది. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో అప్పట్లో ఈ లారీలను పెద్దగా పట్టించుకోలేదు. అడపదడపా ఒకటి రెండు లారీలు పట్టుకుని చేతులు దులుపుకునేవారు.

కొనసాగుతున్న దందా

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా బియ్యం ఎగుమతులు మాత్రం తగ్గలేదు. రాత్రి సమయాల్లో లారీలు తీరం నుంచి సరిహద్దు జిల్లా దాటుతున్నాయి.ఈ జిల్లాల్లోని కొంతమంది బ్రోకర్లు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని కాకినాడకు తరలిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా లారీలు తక్కువ సంఖ్యలోనే తరలిపోతున్నాయి.ఇవి కూడా అర్ధరాత్రి సమయాల్లోనే. తీరంలో ఎక్కడా తనిఖీ లకు చెక్ పోస్టులు అంటూ లేవు. ప్రస్తుతం 216 జాతీయ రహదారి పూర్తయి ట్రాఫిక్ పెరిగినా పోలీస్ నిఘా మాత్రం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే చీకటి దందాలకు తీర ప్రాంత రహదారి అడ్డాగా మారింది.



..అనే నేను!




నిమ్మల రామానాయుడు



పితాని సత్యనారాయణ

శాసనసభలో నేడు ఎమ్మెల్యేల పదవీ ప్రమాణ స్వీకారం



అరిమిల్లి రాధాకృష్ణ



రఘురామకృష్ణరాజు



బొలిశెట్టి శ్రీనివాస్



పులపర్తి రామాంజనేయులు



బొమ్మిడి నాయకర్

• బాధ్యత పెరిగింది

తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు భారీ ఆధిక్యతతో విజయం అందించారు. నా బాధ్యతను పెంచారు. నియోజకవర్గ ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తాం.అవినీతి లేని అభివృద్ధి చేసి చూపిస్తాం. తాడేపల్లిగూడెం పట్టణంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పూర్తిచేసి మంచినీటి కొరత తీరుస్తాం. భూగర్భ డ్రైనేజీని అందుబాటులోకి తీసుకువస్తాం. గ్రామాలకు తాడి పూడి జలాలను పూర్తిస్థాయిలో తీసుకువచ్చే బాధ్యత మాది.

- తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

• హామీలన్నీ అమలు చేస్తాం

వైసీపీ ఐదేళ్ల పాలనలో తణుకు నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. నియోజకవర్గాన్ని గాడిన పెట్టాలి. ఎన్నో ఆశలతో నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారు. గతంలో ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశాను. రానున్న ఐదేళ్లు అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. ఇచ్చిన హామీలన్నీ నెరువేరుస్తాం.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

• ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఆచంట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటాను.గడిచిన ఐదేళ్లలో ఆచంట నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేకపోయింది. నియోజకవర్గంలోని అన్ని వర్గాలు నష్టపోయాయి.ఆచంట ప్రజలు మరోసారి ఇచ్చిన అవకాశాన్ని అభివృద్ధికి పూర్తిస్థాయిలో వినియోగిస్తాం.అత్యధిక నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తాం.

-ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

ఆ వెంటనే అందరికి అధికారాలు వర్తింపు

అన్నిచోట్లా ప్రొటోకాల్ అమలు చేయాల్సిందే

నూతన ఎమ్మెల్యేల ఎదుట పెనుసవాళ్లు

ఆల్ ది బెస్ట్ చెప్పిన నేతలు, కార్యకర్తలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా మన్ననలు పొంది, తిరుగులేని ఆధిక్యతతో గెలుపొందిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 15 మంది కూటమి అభ్యర్థులంతా నేడు శాసనసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇంతకుముందే ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఆయన మంత్రివర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేయగా, ఇప్పుడు శాసనసభలో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికిగాను ఇప్పటికే అన్ని ఏర్పాట్లు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో నలుగురు టీడీపీ పక్షాన, ముగ్గురు జనసేన పక్షాన గెలుపొందారు. వీరంతా అఖండ మెజార్టీలతోనే ప్రత్యర్థులను చిత్తుచేశారు.

జిల్లా నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, అంజిబాబు, ఆరిమిల్లి రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లు శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. జిల్లా నుంచి తొలిసారిగా బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్‌లు అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. అన్ని నియోజకవర్గాలలోనూ తెలుగుదేశం, జనసేన అభ్యర్థులంతా భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. ఎన్నికల చరిత్రలో రికార్డులను తిరగరాశారు. పాలకొల్లు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు లో 60 వేలు మెజారిటీలు దాటి పోయాయి. ఉండి, నర్సాపురంలో 45 వేలు పైగా మెజారిటీ సాధించారు. కూటమి ఎమ్మెల్యేలంతా గెలుపొందడంతో జిల్లా ప్రజల్లోనూ జోష్ నెలకొంది. ఇక అభివృద్ధి పరుగులు తీస్తుందని ఆశిస్తున్నారు. ప్రాజెక్టులు కార్యరూపం దాల్చనున్నాయి. పెండింగ్ పనులు పూర్తి కానున్నాయి. ఐదేళ్లలో కుంటుపడ్డ ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళ్లడానికి ఎన్నికైన శాసనసభ్యులు చిత్తశుద్ధితో ఉన్నారు. వారందరికి ఇప్పుడు అభివృద్ధే ఒక సవాల్‌గా మారనుంది. నిధులు రప్పించుకోవాలి, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి.. జాతీయ, రాష్ట్ర , జిల్లా రహదారులు, వాటర్ గ్రిడ్ ప్రాజక్టు, ఆక్వా యూనివర్సిటీ, పట్టణాలలో అమృత్ ప్రాజెక్టులు కీలకంగా ఉన్నాయి. ఆక్వా రంగ అభివృద్ధికి కూడా హామీ ఇచ్చారు. ఇవన్నీ నెరవేర్చే బాధ్యత జిల్లా శాసనసభ్యులపై ఉంది.

ఆల్ ది బెస్ట్

శాసనసభ్యులుగా నేడు పదవీ ప్రమాణం చేయనున్న ఎమ్మెల్యేలు అందరికి కూటమి పక్షాన నేతలు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎందుకనంటే అధికారికంగా రేపటినుంచే ఎమ్మెల్యేలంతా తమ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. తదనుగుణంగానే వీరందరికి ప్రభుత్వపరంగా అందాల్సిన అన్నింటిని సమకూర్చబోతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన అనేక పథకాలను వీరు తమ నియోజకవర్గాల్లో పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఈ నెలాఖరు నాటికే కొంతలో కొంత పాలనా యంత్రాంగం ఒక గాడిన పడే అవకాశం ఉన్నందున అధికారుల సమీక్షలకు కీలక నిర్ణయాలకు అవకాశం ఉండబోతోంది. నామినేటెడ్ పదవుల విషయంలోనూ వివిధ సిఫార్సులు అందుబాటులోకి వస్తాయి. నేడు ప్రమాణం చేయనున్న శాసనసభ్యుల పక్షాన ఇప్పటికే ఆయా నియోజక వర్గాల్లో కార్యకర్తలు, నేతలు సంబరాలు చేస్తూనే ఉన్నారు.

• భీమవరాన్ని రోల్ మోడల్‌గా నిలుపుతా

భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తా. మూడోసారి ఎమ్మెల్యేగా ప్రజలు ఆశీర్వదించారు. భీమవరం నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటాను. ఔటర్ రోడ్డు, అమృత్ ప్రాజెక్టు, డ్రెయిన్లు, రహదారులు, ఆక్వా రంగాల అభివృద్ధి వంటివి ఎన్నో చేయాల్సి ఉంది. డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతాం. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిపై భీమవరం నియోజకవర్గ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

- భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు

• ఆక్వా, తాగునీటికి ప్రాధాన్యం

ఉండి నియోజకవర్గంలో ఆక్వా రంగం పూర్తిగా దెబ్బ తింది. రైతులు దారుణంగా నష్టపోయారు. ఆక్వా రంగా నికి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తా. నియోజక వర్గంలో డ్రెయిన్లు అన్నీ పూడుకుపోయాయి. డ్రెయిన్ల ప్రక్షాళన చేపడతాం. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా గోదావరి జలాలను రప్పించి ప్రతీ ఇంటికి మంచినీరు అందించే బాధ్యత మాది.

-ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

• తీరప్రాంత అభివృద్ధే ధ్యేయం

నర్సాపురం నియోజకవర్గం తీరప్రాంతాలలో విస్తరించి ఉంది. నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు తిష్ఠ వేశాయి. తీరప్రాంత ప్రజలకు మంచి నీళ్ళు లేవు.పట్టణంలో మౌలిక వసతులు లేకుండా పోయాయి. వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో పనులన్నీ శంకుస్థాపనలకే పరిమి తమయ్యాయి. వశిష్ట వారధి, ఆక్వా యూనివర్సిటీ, హార్బర్, ప్రాజెక్టులను పూర్తి చేస్తాం. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తాం. తీరప్రాంతాలకు మంచినీరు అందిస్తాం.

-నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్

పోలవరం మా బాధ్యత

జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు పదవీ బాధ్యతలు

పాలకొల్లు, జూన్ 20 : రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంతో పాటు జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టులన్నింటికి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లో ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కాల్వల్లో నీరు పారకుండా చేసింది. పంట కాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీతకు సంబంధించిన పనులపై తొలి సంతకం చేశా. వ్యవసాయ రంగానికి జీవం అందించే జల వనరుల శాఖను నాకు కేటాయించడం అదృష్టం. నాకు ఇచ్చిన బాధ్యతను నూరుశాతం న్యాయం చేస్తా. వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేసి రాష్ట్ర రైతులకు తీరని అన్యాయం చేసింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు సహకారంతో ఐదేళ్లలో పోలవరం పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు బహుమతిగా ఇవ్వడం మా బాధ్యత. అలాగే రాష్ట్రంలోని సాగు నీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రాష్ట్రాన్ని దేశంలోనే వ్యవసాయ రంగంలో మరో మెట్టుపైకి తీసుకెళ్తాం' అని చెప్పారు.





కె.లంక ఛానల్‌ను పరిశీలిస్తున్న రైతులు

వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం


కాళ్ల మండలం రైతులకు కలెక్టరు హామీ

కాళ్ల(ఉండి), జూన్ 20: వారం రోజులలో కాళ్ల మండలంలోని రైతుల సాగునీటి కష్టాలను పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టరు సుమత్‌కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. మండలంలోని కాళ్ల గ్రామంలో సార్వా ఆకుమడులు వేసుకోవడానికి నీరు లేకపోవడంతో రైతులు ఈనెల 18న మంగళవారం జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్‌ను కలిశారు. ఆయన తక్షణమే స్పందించి దీనిపై విచారణ చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావును నియమించారు. గురువారం కాళ్ల పంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో ఆయన సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.లంక ఛానల్ పరిశీలించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ప్రధానంగా రొయ్యలు చెరువుల నీరును పంటకాలువలోకి విడిచి పెట్టడం ఉప్పునీరు,బోర్లు వల్ల తాగునీరు కలుషితం అవుతుందని దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమవరంలోని రైతులు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉండి నుంచి ప్రధాన కాలువ పూడుకుపోవడంతో సాగునీరు శివారు ప్రాంతానికి రావడం లేదని తక్షణమే కాలువ పూడికతీత పనులను చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. కె.లంక ఛానల్‌ను పరిశీలించిన అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. రైతుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టరు తెలిపారు.

దడ పుట్టిస్తున్న కూరగాయలు

భారీగా పెరిగిన ధరలు

తగ్గాలంటే నెలరోజులు ఆగాల్సిందే



ఏలూరు టూటౌన్, జూన్ 20 : రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు చూసి వినియోగ దారులు బెంబేలెత్తుతున్నారు. ఏది కొనాలన్నా కిలో 50 పైనే ఉంటున్నాయని ఇంకేం తినాలని సామాన్యులు గగ్గోలు పెడుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండలకు కూరగాయల పంటలన్నీ దెబ్బతినడంతో దిగుబడి తగ్గిపోయింది. ఇటీవల కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు మళ్ళీ రైతులు కూరగాయల పంటలు వేయడం ప్రారంభించారు. పంటలు మళ్ళీ దిగుబడికి వచ్చేసరికి 20 రోజుల నుంచి నెలరోజుల సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు కూరగాయల ధరలను భరించక తప్పని పరి స్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం జోక్యం చేసుకుని ధరలు తగ్గిం చేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. టామోటాలు కిలో రూ.60, వంకాయలు రూ.80, ఉల్లి రూ.40, బెండ కాయలు రూ.60, బీరకాయలు రూ.68, క్యారెట్ రూ.56, దొండ కాయలు రూ.40, బంగాళ దుంపలు రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు ప్రభుత్వం కలుగజేసుకుని కూరగాయల ధరల నియంత్రణకు కృషి చేయాలని, టామోటాలు, ఉల్లిపాయలు సబ్సిడీ ద్వారా అందించాలని కోరుతున్నారు.

ప్రజలకు మంచి సేవలు అందించాలి

జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావు

ఘనంగా రెవెన్యూ దినోత్సవం



రెవెన్యూడే సందర్భంగా కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న డీఆర్ ఉదయభాస్కరరావు, అధికారులు

భీమవరం టౌన్, జూన్ 20 : ప్రజలకు మంచి సర్వీసులను అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు ఎల్లప్పుడూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు అన్నారు. గురువారం రెవెన్యూ డే వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేయడం గర్వపడాల్సిన విషయమన్నారు. రెవెన్యూ శాఖ ఒక వ్యవస్థ అని, ఎప్పటికప్పుడు ఉద్యోగులు అవగాహన పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. తెలియని విషయాలు నేర్చుకోవడంలో చిన్న, పెద్ద ఉద్యోగి అనే భావన ఉండకూడదన్నారు. ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రెవెన్యూశాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు,భూ వ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధృవీకరణ పత్రాలు, నీటి పన్నుతో సహా పలు అంశాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి పి.పాపారావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని నేర్చుకుంటే గుర్తింపు ఉంటుందని, శాఖకు సంబంధించి ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా నేర్చుకోవాలన్నారు. ప్రజలకు రెవెన్యూ శాఖపై నమ్మకం కలిగే విధంగా ఉండాలన్నారు. రెవెన్యూ శాఖను ఉన్నతికి, అభివృద్ధికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు తహసీల్దార్ లక్కు నరసింహారావును పూలమాలలతో సన్మానించారు. జిల్లా రెవెన్యూ అధికారి చేతుల మీదుగా కేకును కట్ చేశారు. జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చందన దుర్గాప్రసాద్, రవికుమార్, కృష్ణారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

టీడీపీ కార్యకర్తపై దాడి



భుజంపై గాయం

ఉండి, జూన్ 20: టీడీపీ కార్యకర్త కుటుంబంపై వైసీపీ కుటుంబం దాడి చేసిన సంఘటన ఉండి మండలం యండగండి పంచాయతీ పరిధిలోని రాయుడు వాని గుడెంలో గరువారం జరిగింది. ఇందుకు సంబంధించి బాధితుడు కాల గణేశ్ అతని భార్య గౌరీశైలజ అందించిన వివరాలివి.. పశువుల వ్యర్థాల నీరు తన ఇంటి ముందు నుంచి వెళుతోందని కంపు భరించలేకపోతున్నామని సిమెంట్ తూర తెచ్చుకుని వేసుకోవాలని తనకు సమీపంలో ఉండే తంగిళ్ల వెంకటేశ్వరరావుకు గణేశ్ చెప్పాడు. అయితే వెంకటేశ్వరరావు, అతని భార్య వరలక్ష్మి, కుమారుడు రఘు తమ కుటుంబంపైకి వచ్చి కర్రతో దాడి చేశారని గణేశ్ తెలిపారు. భార్య కంగారు పడి రాగా ఆమెపై కూడా దాడి చేశారంటూ బాధితుడు వివరించారు. దీనిపై ఉండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే రఘురామ



ఎమ్మెల్యే రఘురామను సన్మానించిన ఆక్వా రైతులు

కాళ్ల(ఉండి), జూన్ 20:ఆక్వారైతుల సమస్యలు పరిష్కరించడానికి తాను కృషిచేస్తానని ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. గురువారం కాళ్ల మండలం పెదఅమిరంలోని ఉండి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన జిల్లా ఆక్వారైతులతో మాట్లాడారు. తొలుత ఆక్వారైతులు పూలమాలతో ఎమ్మెల్యే రఘురామను ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్వారైతులకు తాను ఎల్లప్పుడు అందుబాటులో వుంటానని, మీసమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తానని అన్నారు. కరెంటు సబ్సిడి, ఫీడ్, సీడ్, గిట్టుబాటు ధర, ఎస్ఎఫ్‌డిబి వైజాగ్ కార్యాలయం తదితర సమస్యలపై తాను దృష్టి పెడతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ఆక్వా రైతులంతా సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. స్తోమత వున్న రైతులంతా ఎకరాకు రూ.1000 నుంచి పైబడి చొప్పున అందించాలని కోరారు. అక్కౌంట్ నెం.43068 663494కు సొమ్ము జమ చేయవచ్చని తెలిపారు. ఈ నగదుతో కాల్వలు, డ్రెయిన్లు, రోడ్ల అభివృద్ధికి ఖర్చు పెడతామని తెలిపారు.

వైసీపీకి రాజీనామా

పాలకోడేరు, జూన్ 20: గొరగనమూడి గ్రామానికి చెందిన వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవికి పొన్నమండ బాలకృష్ణ రాజీనామా చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆయన కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను అడ్డుపెట్టుకుని విజయం సాధించి ఈ ఐదేళ్ల కాలంలో ఎస్సీ, ఎస్టీలకు ఏమి చెయ్యకపోగా ఎన్నో ఇబ్బందులకు గురి చేసిందని అన్నారు.




















విద్యార్థుల విజయాలు సంస్థకు మేలు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 20 : విద్యార్థులు సాధించన విజయాలే అధ్యాపకునికి, సంస్థకి పేరు తెస్తాయని తమిళనాడులోని త్యాగరాజన్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ఆర్ అండ్ డి డీన్ డా.ఎస్ భాస్కర్ అన్నారు. ఎస్ఆర్కెఆర్‌లో ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీసీ)పై మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్‌ను ఆయన గురువారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.భాస్కర్ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో అక్కడ దాదాపు మూడు దశాబ్ధాల క్రితమే ఔట్‌కం బేస్డ్ విద్యావిధానాన్ని అవలంబించడం వలన ఎన్నో మంచి ఫలితాలు సాధించాయన్నారు. భారతదేశంలో ఏటా 1.5 మిలియన్ ఇంజనీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారని వారిలో 10శాతం మించి ఉద్యోగాలు, ఉపాధి పొందలేకపోతున్నారన్నారు. దీనిని అధిగమించడానికి కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో ప్రధానంగా అధ్యాపకుడు విద్యార్థులు ఆకర్షించే విధంగా వారికి విద్యా బోధన చేయటం, కేవలం సిలబస్ కోసం ఎంపిక చేసిన సమయమే కాకుండా విద్యార్థి ఆ సబ్జెక్ట్‌లో పరిపూర్ణత సాధించేలా పాఠ్యాంశాలు బోధన ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.



కాల్వల ప్రక్షాళన చేస్తాం: ఎమ్మెల్యే అంజిబాబు


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 20 : నియోజకవర్గంలో డ్రెయిన్లు, కాల్వలు గుర్రపు డెక్క, తూడు, చెత్తలతో నిండిపోయాయని, దీని కారణంగా రైతులు సార్వా నారుమడులు వేసుకోడానికి నీరు అందక ఆందోళన చెందుతున్నారని, వెంటనే పరిష్కార మార్గం చూపాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులకు సూచించారు. భీమవరంలో ఇరిగేషన్ ఈఈ దక్షిణామూర్తి, డ్రెయినేజీ ఈఈ ఎంవీవీ కిషోర్ తదితర అధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ తక్షణమే యుద్ధ ప్రాతిపదికన తూడు, చెత్త తొలగింపు పనులు చేపట్టాలని, నామినేషన్ పద్ధతిలో రూ.5 లక్షల చొప్పున విభజించి స్థానిక రైతులకే పనులు అప్పగించాలని, ఈవిషయాన్ని కలెక్టర్ తో మాట్లాడడం జరిగిందని తెలిపారు. 10 మీటర్లు ఉండాల్సిన కాల్వలు రెండు మీటర్లుకు చేరిపోయాయని అన్నారు. ఆక్రమణలు పెరిగిపోయాయన్నారు. కాలువలను ప్రక్షాళన చేస్తామని అన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

వీరవాసరం (భీమవరం టౌన్): పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధి విషయంలో ఎవరు తన దగ్గరికి వచ్చినా తప్పనిసరిగా వారి వెంట తను ఉంటానని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పేర్కొన్నారు. గురువారం వీరవాసరం మండల స్థాయిలోని విద్యార్థులకు వీరవాసరం ఎంఆర్కె జడ్పీఉన్నతపాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు బట్టలు పంపిణీ చేశారు.

కోపల్లెలో సంచార విజ్ఞాన ప్రదర్శన

కాళ్ల(ఉండి), జూన్ 20: సంచార విజ్ఞాన ప్రదర్శనశాల విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని గ్రామ ఉప సర్పంచ్ బూడి పత్రాలు అన్నారు. గురువారం కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంచార విజ్ఞాన ప్రదర్శన ప్రారంభించారు. ఉపసర్పంచ్ మాట్లాడుతూ జన్యు ఆరోగ్య సమస్యలు, మేనరికం వల్ల జరిగే అనర్థాలు గురించి, ఇతర వ్యాధులు గురించి సమగ్రంగా ఈసంచార వాహనం ద్వారా తెలుసుకోవచ్చునని తెలిపారు.

నిష్పక్షపాతంగా సేవలందించాలి

ఆకివీడు, జూన్ 20: ఉద్యోగులు నిష్పక్షపాతంగా ప్రజాహితం కోసం సేవలందించాలని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి అన్నారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ వ్యవస్థలో ఉద్యోగం చేయడమంటే కత్తిమీద సాములాంటిదన్నారు. కార్యక్రమంలో డీటీ ఫరూఖ్, రీ సర్వేయర్ డీటీ జీవనరాణి, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

అన్నం పెట్టడం పూర్వజన్మ సుకృతం

ఆకివీడు, జూన్ 20: దొరగారి చెరువు దగ్గర దాతలు సహకారంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌లో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి పేదలకు గురువారం అన్నం వడ్డించి మాట్లాడారు. పూర్వజన్మ సుకృతం ఉంటేనే ఇటువంటి మంచి సేవా కార్యక్రమాలు చేయడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, డీటీ ఫరూఖ్ పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


పుస్తకాలు అందిస్తున్న బాపిరాజు

ఆకివీడు, జూన్ 20: ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యా బోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు అన్నారు. గురువారం అయి-భీమవరంలోని కెవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిద్ధాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆకివీడులో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నౌకట్ల రామారావు, జిల్లా బీసీ నాయకుడు మీసాల రవికుమార్, అయి-భీమవరం మాజీ సర్పంచ్ కృష్ణంరాజు, టీడీపీ రాష్ట్ర రైతు నాయకుడు భూపతిరాజు తిమ్మరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు తదితరులు పాల్గొన్నారు.















మంత్రి నిమ్మలకు అభినందన

భీమవరం అర్బన్, జూన్ 20: నూతనంగా రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుని అమరావతిలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీను తదితరులు అభినందనలు తెలిపారు. భీమవరం పార్టీ నాయకులు బర్రె నెహ్రూ, మద్దుల రాము, గంటా త్రిమూర్తులు, షైలబత్తుల ఐజాక్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

గణపవరం, జూన్ 20: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాలయాలకు క్రమం తప్పకుండా హాజరవుతూ ఉన్నత విద్యను పెంపొందించుకోవడానికి శ్రమించాలని స్థానిక వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు సూచించారు. 2023-24 సంవత్సరంలో పదో తరగతి హాజరులో అధిక శాతం సాధించిన విద్యార్థులకు గురువారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అభినందించి జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





సీఐ కార్యాలయం పరిశీలన



నరసాపురం, జూన్ 20: పట్టణంలోని రూరల్ సీఐ కార్యాలయాన్ని గురువారం కమిషనర్ వెంకటేశ్వరావు సందర్శించారు. గతంలో ఈ కార్యాలయం అన్నక్యాంటీన్‌గా ఉండేది. గత ప్రభుత్వం దీన్ని స్వాధీనం చేసుకుని రూరల్ సీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మళ్లీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేయడంతో తిరిగి ఈ భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు మునిసిపాల్టీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఈనేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి కమిషనర్ కార్యాలయాన్ని పరిశీలించారు.





మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల, సత్యప్రసాద్‌లను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర

మంత్రులకు అభినందన

పాలకొల్లు అర్బన్, జూన్ 20 : మాజీ ఎమ్మెల్సీ అంగర ఆధ్వర్యంలో జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులను అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్‌తో పాటు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కర్, బోనం నరసయ్య, బొప్పన హరికిషోర్, బోణం నాని, కడలి గోపి, పీతల శ్రీను, చిలుకూరి బాలాజీ, మామిడిశెట్టి పెద్దిరాజు, టిడిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరు నాయుడు, తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కర్నేన రోజా రమణి, కె అయ్యప్ప నాయుడు తదితరులు ఉన్నారు.

● రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నిమ్మల రామానాయుడును ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులుసన్మానించారు. అధ్యక్షుడు నీలం రవి, సభ్యులు తాళ్ళ బాలు, బి.సాంబమూర్తి, వాకలపూడి బాబ్జీ, శంకరరావు, కొరుకొండ సుబ్బారావు, తోట సత్యనారాయణ, సిద్దుల శ్రీను, కాసా కోటీ వీరభద్రం, బి దుర్గా ప్రసాద్, నాగేంద్ర పాల్గొన్నారు




మంత్రి పవన్‌ను కలిసిన చాగంటి చిన్న

నరసాపురం, జూన్ 20: మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కళ్యాణ్‌ను గురువారం జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న కలిసి అభినందనలు తెలిపారు. నరసాపురం నియోజకవర్గంలో పర్యటించాలని మంత్రిని ఆహ్వానించారు.

సెమిస్టర్ ఫలితాల్లో 83.13శాతం ఉత్తీర్ణత

పాలకొల్లు అర్బన్, జూన్ 20 : స్థానిక ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో మే మొదటి వారంలో జరిగిన 2వ సెమిస్టర్ ఫలితాల్లో 83.13శాతం ఉత్తీర్ణత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి తెలిపారు. 166 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గానూ 138 మంది ఉత్తీర్ణత సాధించారని, అలాగే 4వ సెమిస్టర్ ఫలితాల్లో 150 మందికి గానూ 97 మంది ఉత్తీర్ణత సాధించారని (54.67శాతం) ప్రిన్సిపాల్ తెలిపారు.











బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.13లక్షలు

మొగల్తూరు, జూన్ 20: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 60 రోజులకు గానూ రూ.13లక్షల 67వేల, 115 ఆదాయం లభించినట్టు ఈవో డి.రామకృష్ణంరాజు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం: ఎమ్మెల్యే నాయకర్


విద్యార్థులకు బ్యాగ్‌లందిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, పొత్తూరి

నరసాపురం టౌన్, జూన్ 20: ప్రభుత్వ స్కూళ్ళల్లో మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. గురువారం పట్టణంలోని పీచుపాలెం, రుస్తుంబాదా కొత్తపల్లి హైస్కూల్‌ల్లో విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. అన్ని స్కూళ్లల్లో మెరుగైన ఫలితాలు ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మాజీ ఎమ్మెల్యే జానకీరామ్, చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, ఎంఈవో పుష్పరాజ్యం, కౌన్సిలర్ బొమ్మిడి సూర్యకుమారి, కోటిపల్లి సురేష్, దొండపాటి స్వామి, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరావు, కావలి నాని, పోలిశెట్టి సాంబ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

మొగల్తూరు, జూన్ 20: రామన్నపాలెం పంచాయతీ పివితోట ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, సర్పంచ్ బందెల ఎలిషా, ఉప సర్పంచ్ మేకల పరుశరామ్, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఎంపీటీసీ ధనలక్ష్మీ, ఆకన దుర్గ పాల్గొన్నారు.

పెనుగొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అన్నారు. గురువారం పెనుగొండ, దేవ, నడిపూడి బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు బ్యాగ్‌లు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నక్కా వేద వ్యాస శాస్త్రి, మద్దింశెట్టి వెంకటేష్, కట్టా గణేష్, గణపతి, హెచ్‌ఎంలు, విద్యార్థుల పాల్గొన్నారు.


• వడలి ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ ఆధ్వర్యంలో స్కూలు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమండలో టీడీపీ మండల అధ్యక్షుడు వెలిచేటి బాబూ రాజేంద్ర ప్రసాద్, ఎంఈవో పి. రామకృష్ణ, డి.సుభాకర్, ఉప్పలపాటి చంటి, బుల్లియ్య, బొర్రా నాగేశ్వరరావు, నాగూర్ పాల్గొన్నారు.


రిటైర్డ్ తహసీల్దార్‌కు సన్మానం

నరసాపురం టౌన్, జూన్ 20: ఏపీ రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో అంబరీష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిటైర్డ్ తహసీల్దార్ ఆత్కూరి వెంకట నరసయ్యను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ శాఖల్లో చాల కీలకమైన శాఖ రెవెన్యూ అని, ప్రజలకు సేవ చేసే అవకాశం కూడా ఈ శాఖలోనే ఉందన్నారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ నాగదేవి, ఆర్ఐ యాశోద, వీఆర్వోలు లక్ష్మీనారాయణ, చిరంజీవి, శేఖర్, జయరాం పాల్గొన్నారు.




















భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 28.0

సంపూర్ణ ఆరోగ్య సాధనం యోగా | నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

- 7లో



..అనే నేను

శాసనసభలో నేడు ఎమ్మెల్యేల పదవీ ప్రమాణ స్వీకారం



పోలవరం మా బాధ్యత

జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు బాధ్యతలు

216పై చీకటి దందా



కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా

వివరాలు 111 లో..



శ్వాసపై ధ్యాసే యోగా

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

యోగా.. ప్రపంచానికి భారతదేశం పరిచయం చేసిన అద్భుత ఆరోగ్య ప్రక్రియ. యోగా వ్యాయామమే కాదు సంపూర్ణ ఆరోగ్య సాధన కోసం ఓ జీవన శైలి. మనిషి అంతఃకరణ దృష్టిని పెంచు కోవడంతో పాటు మానసిక పరివర్తనను సాధించుకోవడానికి యోగా ఉపయోగపడుతుంది. సంపూర్ణ ఆరోగ్యానికి, ఆనందానికి, మానసిక ప్రశాంతతకు యోగా ఓ దివ్యౌషధం. రోగ రహిత సమాజం సాధనకు యోగా దివ్యమైన మార్గమని నిపుణులు చెబుతున్నారు. మహర్షులు వేసే ఆసనాలను శాస్త్రీయంగా క్రోడీకరించి యోగాశాస్త్రాన్ని పతంజలి మహర్షి మనకు అందించారు. భారతీయ ప్రాచీన కళైన యోగా ప్రస్తుతం ప్రపంచ పటంలో భారతదేశం ఓ విశిష్ట స్థానాన్ని ఏర్పరచింది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

– నిడమర్రు/ఆకివీడు

యోగా విశిష్టత..

మనిషి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసం ద్వారా మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించడానికి యోగా ఓ ఉత్తమ సాధనంగా ఉంటుంది. యోగా ద్వారా మనిషి అద్భుత జీవన విధానాన్ని అలవర్చుకుంటాడు. యోగా అనగా సంస్కృతంలో శరీరం-మనసు స్పృహల కలయిక, ఏకం చేయడం అని అర్థం. ప్రాచీన కాలం నుంచి భారత ఇతిహాసాలైన రామాయణ, మహాభారత కాలాల్లో కూడా యోగా ప్రస్తావన కలదు. రాముడు ధ్యానం చేసినా, శ్రీకృష్ణుడు యోగ నిద్రలో ఉన్న అవన్నీ యోగ విద్యలో అంతర్భాగమేనని పురాణాలు చెబుతున్నాయి. యోగా విద్య అన్నింటినీ అవపోషణ చేసి వీటిని శాస్త్రీయంగా రూపకల్పన చేసిన ఘనత రాజగురువు పతంజలికే దక్కుతుంది. పతంజలి పేర్కొన్న యోగ విధానాలు.. యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ప్రత్యాహా, ధారణ, ధ్యానం, సమాధి క్రియల ద్వారా యోగా సిద్ధి సాధించవచ్చని తెలిపారు.

21నే యోగా దినోత్సవం..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ 21న జరుపుకుంటారు. 2014 సెప్టెంబరు 24న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ జూన్ 21న అంర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవాలని సూచించగా 193 మంది ప్రతినిధులలో 173 మంది దీనికి మద్దతు ఇచ్చారు. భద్రతామండలి దేశాలైన అమెరికా, ఫ్రాన్స్, రష్యా, చైనా, ఇంగ్లాండ్ దేశాలు విస్తృత చర్చ అనంతరం ఆమోదించాయి. ప్రతి సంవత్సరం జూన్ 21 నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి కారణం ఈ భూమి మీద ఉత్తరార్ధ గోళంలో అత్యధిక సమయం పగలు ఉండే రోజుగా ప్రసిద్ధి కెక్కింది. ఈరోజు విశిష్టను గుర్తించి మోదీ జూన్ 21న యోగా దిన్సోతవంగా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి సూచించగా అందరూ ఆమోదించారు. దీంతో తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవం ను జూన్ 21, 2015న నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో నిర్వహించారు. నేడు 2024 పదో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నరేంద్ర మోదీ కశ్మీర్‌లో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది యోగా దినోత్సవ నినాదం 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'గా నిర్ణయించి ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారు.



మానసిక ప్రశాంతత కోసం ధ్యానం

నేటి ఆధునిక జీవనశైలి ఒత్తిడిని అధిగమించాలంటే యోగా ఒక్కటే ఏకైక మార్గం. యోగాలో ధ్యానం సాధన చేయడం ద్వారా మెదడులో పేరుకుపోయిన ఒత్తిడి నుంచి దూరం చేయవచ్చు. ధ్యానం చేయాలంటే ముందుగా సుఖాసనంలో కూర్చొని రెండు చేతులు చిన్ముద్రలో ఉంచుకొని కళ్లుమూసుకొని కేవలం శ్వాస మీద ధ్యాసే కల్గి ఉండాలి. మనిషి వయస్సుకు తగ్గట్టు అన్ని నిమిషాలు ధ్యానం చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు పొందవచ్చని యోగా నిపుణులు సూచిస్తున్నారు.

యోగా లోగో విశిష్టత

యోగా లోగోకు ఓ విశిష్టత ఉంది. లోగోలో మనిషి రెండు చేతులు మడతపెట్టి పైకి లేపుతూ యోగంను చూపిస్తున్నది. ఇది వ్యక్తిగత స్పృహతో పాటు, ఐక్యతను ప్రతిబింబిస్తుంది. మనసు - శరీరం- ప్రకృతిల మధ్య సంపూర్ణ సామరస్యాన్ని ఈలోగో సూచిస్తుంది.

ఆరోగ్యం కోసం ఆసనాలు..

యోగా అంటే అందరికీ ముందుగా స్మరణకు వచ్చేది యోగాసనాలే. అత్యంత ఎక్కువగా ప్రాచుర్యం పొందిన యోగా క్రియ ఇది. ఈ యోగాసనాలు ఏడేళ్ల వయసు నుంచి తొంభై ఏళ్ల ముదుసలి వరకు వారి ఆరోగ్య స్థితిని అనుసరించి యోగాసనాలు చేయవచ్చని యోగా గురువులు తెలియజేస్తున్నారు. ఆసనాలలో ముఖ్యమైనవి సూర్యనమస్కారములు. యోగాసనాలలో అత్యంత ప్రాచుర్యం పొందినవి వజ్రాసనం, ప్రణమాసనం, వ్యాఘ్రాసనం, సర్వాంగసనం, మత్స్యాసనం, వృక్షాసనం, హలాసనం, చక్రాసనం, నావాసనం మొదలగునవి.

యోగాసనాలు వల్ల లాభాలు..

యోగాసనాలు చేయడం ద్వారా మనిషికి కండర బలం వృద్ధి చెందుతుంది. శ్వాసక్రియ పెరిగి శక్తి ఉత్తీర్ణం అవుతుంది. సమతుల జీవనక్రియ పెంపొందుతుంది. బరువు తగ్గి ఆరోగ్య స్థితిని పొందవచ్చు. గుండె, రక్త ప్రసరణ ఆరోగ్యవంతమవును. ఇవేకాకుండా మనిషి దీర్ఘకాలిక రోగాలైన నరాల బలహీనత, రక్తపోటు, మధుమేహం, ఉబ్బసం, ఊబకాయం వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు. సర్వజనులకు యోగము సర్వరోగ నివారిణి.

అనారోగ్య సమస్యలు పరిష్కారం



యోగా వల్ల మనిషి నైతిక ప్రవర్తనలో మార్పు సాధ్యం. ఒత్తిడిని జయించవచ్చు. ఊబకాయం, అధిక రక్తపోటు, కీళ్లనొప్పులతో పాటు ఆధునిక జీవన విధానంలో వచ్చే ప్రతి అనారోగ్య సమస్యకు సూర్యనమస్కారాల్లో పరిష్కారం ఉంది.

– నూకల రియశ్రీ, విద్యార్థిని, ఆకివీడు

యోగాతో ఆరోగ్యవంతులు కావాలి



యోగాకు రాకముందు ఒత్తిడి, కోపం, కాళ్ళు లాగడం తదితర సమస్యలుండేవి. యోగా చేసిన దగ్గర నుంచి సమస్యలు తగ్గాయి. యోగాకు వెళ్లడం వల్ల శ్రమనుకుంటే రానున్న రోజుల్లో అదే మనకు భారమై కూర్చుంటుంది. ప్రతీ ఒ క్కరూ శ్రమనుకోకుండా యోగాకు వెళ్లి ఆరోగ్యవంతులగా జీవించాలి.

– వడలి శైలజ, మహిళా పోలీసు, ఆకివీడు

యోగా వల్లే బతికున్నా..



నాలుగు దశాబ్దాల పైబడి ఉచితంగా యోగా అందిస్తున్నాం.. 1983 వరకు అనేక సమస్యలతో బాధపడుతుండేవాడిని. యోగా వల్లే బతికున్నా.. గురూజీ సూర్యరాఘవదీక్షితులు వద్ద యోగా భ్యాసం, ముక్కు-డొక్క కడగడం నేర్చుకుని అప్పటి నుంచి నేటి వరకు అనేకమంది శిష్యబృందానికి యోగా, ఆసన, ప్రాణాయామం, ధ్యానం నేర్పుతున్నాను.

– కందుల సత్యనారాయణ, యోగాసనాచార్య, ఆకివీడు

యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు..



అందరికీ యోగా అందలానే సంకల్పంతో యోగా ప్రచార పరిషత్ ఏర్పాటు చేయడం జరిగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా, తూర్పుగోదావరి, విశాఖపట్నం ప్రాంతాలలో యోగా కేంద్రాలు ఏర్పాటు చేసి యోగ సాధన నేర్పిస్తున్నాం.

– యోగాచార్య సాంబశివరావు, యోగా ప్రచార పరిషత్, ఆకివీడు

ధ్యానంతో మానసిక, ఆధ్యాత్మిక పరిపక్వత పెంపు..



ధ్యానం మనిషిలో మానసిక, ఆధ్యాత్మిక పరిపక్వతను పెంపొదిస్తుంది. విద్యార్థులు ధ్యానం చేయడం ద్వారా ఏకాగ్రత పెంచుకొని చదువులో అత్యున్నత ప్రమాణాలు పొందగలడు. మనిషి తన గురించి తాను తెలుసుకునే అద్భుత పక్రియే ధ్యానం. మనలోకి మనం చూసుకొనే చక్కని అవకాశం ధ్యానం మనకు కల్పిస్తుంది.

– పెరుమాళ్ళ మురళీకృష్ణ, యోగా గురువు , గణపవరం

సెమిస్టర్ ఫలితాల్లో 83.13శాతం ఉత్తీర్ణత

పాలకొల్లు అర్బన్, జూన్ 20 : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల (అటానమస్)లో మే మొదటి వారంలో జరిగిన 2వ సెమిస్టర్ ఫలితాల్లో 83.13శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజ రాజేశ్వరి తెలిపారు. 166 మంది విద్యార్థినీ, విద్యార్థులకు గానూ 138 మంది ఉత్తీర్ణత సాధించారని, అలాగే 4వ సెమిస్టర్ ఫలితాల్లో 150 మందికి గానూ 97 మంది ఉత్తీర్ణత సాధించారని (54.67శాతం) ప్రిన్సిపాల్ తెలిపారు.



విద్యార్థులకు కిట్‌ల పంపిణీ


పెంటపాడులో విద్యా సామగ్రి అందజేత

పెంటపాడు, జూన్ 20 : గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నెంబర్-1 వద్ద గురువారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు, సర్పంచ్ తాడేపల్లిసూర్యకళ, బండారు వెంకట్రావు, దాసరి సతీష్‌కుమార్, కొనకళ్ళ హరినాథ్, కసిరెడ్డి మధులత, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రెడ్డిసూరిబాబు, ఎంఈవో లు శ్రీనివాస్, టీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని అత్తిలి ఇన్‌చార్జి ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు కోరారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు కిట్లను అత్తిలి సర్పంచ్ గంటా విజేత నాగరాజు అధ్యక్షతన అందజేశారు. 10వ తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థి రేవంత్ కుమార్‌కు, మండల స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎస్వీఎస్సెస్ త్రివేణికి జనసేన అధ్యక్షులు ప్రసాద్ నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు, మాజీ ఎంపీపీ మక్కా సూర్యారావు, పోలిశెట్టి చంటి, చందు, కోరిపల్లి హరి, ఆల్తి సత్యనారాయణ, ఎంఈవో ఎస్.రమేష్, ఎంపీఎల్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుకు మాలమహానాడు కృతజ్ఞతలు

పాలకొల్లు అర్బన్, జూన్ 20 : విదేశీ విద్యా దీవెన పథకం పేరును డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓవరీస్ విద్యా నిధిగా మార్పు చేస్తూ ప్రకటన చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మాపు సూర్య వర ప్రసాద్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో దళితుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ దళితులను మోసగించారన్నారు. 27 దళిత పథకాలను రద్దు చేశారని ఆరోపించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్



మొగల్తూరు, జూన్ 20: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు లక్ష్మీపార్వతి కోరారు. రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోటలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా ఆమె రోగులను పరీక్షించారు. రోగుల ఇళ్ళకు వెళ్ళి పరీక్షించారు. అలాగే గ్రామ సచివాలయానికి వచ్చిన 88 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు.

కేంద్ర మంత్రిని కలసిన బీజేపీ నేత



నరసాపురం, జూన్ 20: కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మను గురువారం ఎయిర్‌పోర్టులో నరసాపురం బీజేపీ కన్వీనర్ మేకల సతీష్ కలిశారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రానికి విచ్చేసిన మంత్రిని సన్మానించారు. నరసాపురం నియోజకవర్గంలో పర్యటించాలని ఆహ్వానించారు. వశిష్ఠ వారధి, ఆక్వా యూనివర్సిటీ, హార్బర్ స్థలాలు పరిశీలించాలని కోరారు. దీనికి స్పందించిన కేంద్ర మంత్రి త్వరలో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

సీఐ కార్యాలయం పరిశీలన



నరసాపురం, జూన్ 20: పట్టణంలోని రూర ల్ సీఐ కార్యాలయాన్ని గురువారం కమిషనర్ వెంకటేశ్వరావు సందర్శి ంచారు. గతంలో ఈ కార్యాలయం అన్నక్యాంటీన్‌గా ఉండేది. గత ప్రభుత్వం దీన్ని స్వాధీనం చేసుకుని రూరల్ సీఐ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. మళ్లీ ప్రభుత్వం అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేయడంతో తిరిగి ఈ భవనాన్ని స్వాధీనం చేసుకునేందుకు మునిసిపాల్టీ ఇప్పటికే నోటీసులు జారీ చేసింది. ఈనేపథ్యంలో ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి కమిషనర్ కార్యాలయాన్ని పరిశీలించారు.

రిటైర్డ్ తహసీల్దార్‌కు సన్మానం


నరసాపురం టౌన్, జూన్ 20: ఏపీ రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో అంబరీష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. రిటైర్డ్ తహసీల్దార్ ఆత్మూరి వెంకట నరసయ్యను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ శాఖల్లో చాల కీలకమైన శాఖ రెవెన్యూ అని, ప్రజలకు సేవ చేసే అవకాశం కూడా ఈ శాఖలోనే ఉందన్నారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ నాగదేవి, ఆర్ఐ యాశోద, వీఆర్వోలు పాల్గొన్నారు.











ధాన్యం బకాయిలు చెల్లించండి



పెంటపాడు, జూన్ 20 : ధాన్యం బకాయిలు చెల్లించాలంటూ రైతులు రావిపాడు సొసైటీ వద్ద గురువారం ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ దాళ్వా ధాన్యం అమ్మకాలు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా నేటికి సొమ్ములు తమ చేతికి రాలేదంటూ వాపోయారు. సార్వాసాగు పెట్టుబడి కోసం చేతిలో సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయి సొమ్ములు త్వరగా తమ ఖాతాలలో జమ చేయాలని కోరారు.

అంబేడ్కర్ పేరు పునరుద్ధరించడం అభినందనీయం

ఇరగవరం, జూన్ 20 : జగనన్న విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరును పునరుద్ధరించడం అభినందనీయమని జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ పేరును పెట్టుకోవడంతో దళిత ప్రజా సంఘాలు ఉద్యమాలు చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో హుందాగా వ్యవహరిస్తున్నారన్నారు.

తారక్‌నాథ్‌కు నివాళులు

పాలకొల్లు, జూన్ 20 : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన వై తారక్ నాథ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని మూడు బ్రాంచ్‌ల సిబ్బంది ఆయా బ్రాంచ్‌ల్లో తారక్ నాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మొయిన్ బ్రాంచ్ కార్యదర్శి కెఎస్ శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తారక్ నాథ్ సేవలు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా రాజుల వృద్ధుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.



చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు



సచివాలయం వద్ద చంద్రబాబు, పవన్ చిత్రాలు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 20: రాబోయేది కూటమి రామరాజ్యమని దానికి సూచికగానే కృష్ణార్జునుల్లాంటి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రాలు సచివాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నామని జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, సర్పంచ్ పిల్లా రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని దండగర్ర సచివాలయం వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలను గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాసగాని రాంబాబు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

ఇరగవరం, జూన్ 20 : గ్రామంలో తాగునీటికి సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మహ్మద్ బుఖ్రా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో లలిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ట్యాంక్‌లను 15 రోజులకు ఒకసారి శుభ్రపరిచి క్లోరినేషన్ చేయాలన్నారు. ఈఓపీఆర్డీ కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ఇరగవరం, జూన్ 20 : ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అవకాశం కేవలం రెవెన్యూ శాఖకు దొరకడం అదృష్టంగా భావించాలని తణుకు డిప్యూటీ తహసీల్దార్ కోన ఉదయ్ భాస్కర్ అన్నారు. ఆంధ్ర రాష్ట్ర రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ మంజూరు చేయు ధ్రువీకరణ పత్రాలను ప్రదర్శన ఉంచారు. రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు డిప్యూటీ తహసీల్దార్ ఎడ్విన్ పాల్, వీఆర్వో బంగారు రాజు, అటెండర్ జానకిరామును శాలువలతో సత్కరించారు. రాష్ట్ర గ్రేడ్-2 రెవెన్యూ అధికారులు అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.సుధాకర్ చౌదరి, మండల అధ్యక్షుడు సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దారు బి.సూర్యనారాయణరాజు, కె.కాళీకృష్ణ, ఆర్ఐ భవానీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 20: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆరుగొలనుకు చెందిన చిక్కాల జోగయ్యకు చెందిన రెండు పోర్షన్‌ల తాటాకిల్లు బుధవారం అర్ధరాత్రి దగ్ధమైంది. దీంతో జోగయ్య కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో పరుగులు తీశారు. బంగారం, నగదు, విద్యుత్తు ఉపకరణాలు కాలి బూడిదయ్యాయి. తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది, సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం ఉంటుందని బాధితులు చెబుతున్నారు.

అంబేడ్కర్ విదేశీ విద్య అభినందనీయం

మొగల్తూరు, జూన్ 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంబేడ్కర్ పేరుతో విదేశీ విద్యను పునరుద్ధరిస్తూ ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని జిల్లా తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు డొల్లా రత్నంరాజు అన్నారు. గురువారం ఆయన మొగల్తూరులో విలేకరులతో మాట్లాడుతూ దళితుల ఓట్లుతో అధికారంలోకి వచ్చిన జగన్ మోహనరెడ్డి ఎస్సీలకు అమలు అయ్యే 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి తీరని అన్యాయం చేశారన్నారు.

నేడు విద్యుత్ పరిష్కార వేదిక

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 20: తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో హౌసింగ్ బోర్డు వద్ద ఉన్న రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబ డుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్దనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, హాజరవుతారని వివరించారు.

అన్న సమారాధన

అత్తిలి, జూన్ 20 : గంటావారి పుంతలో గల కొండలరాయుడు స్వామి వారి వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ కమిటీ ఛైర్మన్ గొట్టుముక్కల సత్యనారాయణరాజు అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సరుకుల తూకాన్ని పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారి అప్పలనాయుడు

తూకాలలో తేడాలుంటే చర్యలు

పెంటపాడు, జూన్ 20: తూకాలలో తేడాలుంటే చట్టపరం గా చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ(తూనికలు, కొలతలు) ఇనస్పెక్టర్ అప్పలనాయుడు హెచ్చరించారు. సివిల్‌సప్లై శాఖా మంత్రి ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ప్రత్తిపాడు ఎంఎల్ఎల్ పాయింట్‌లో రేషన్ సరుకులను పరిశీలించారు. కందిపప్పు తూకంలో తేడా ఉండటంతో సప్లయిర్ పై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం తహసీల్దార్ మురళీకృష్ణ, సీఎస్ డీటీ ఎం.సోమేశ్వరరావు పాల్గొన్నారు.











..అనే నేను



నిమ్మల రామానాయుడు | అరిమిల్లి రాధాకృష్ణ



పితాని సత్యనారాయణ | రఘురామకృష్ణరాజు | బొమ్మిడి నాయకర్ | పులపర్తి రామాంజనేయులు | బొలిశెట్టి శ్రీనివాస్

శాసనసభలో నేడు ఎమ్మెల్యేల పదవీ ప్రమాణ స్వీకారం

- ఆ వెంటనే అందరికి అధికారాలు వర్తింపు
- అన్నిచోట్లా ప్రొటోకాల్ అమలు చేయాల్సిందే
- నూతన ఎమ్మెల్యేల ఎదుట పెనుసవాళ్ళు
- ఆల్ ది బెస్ట్ చెప్పిన నేతలు, కార్యకర్తలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా మన్ననలు పొంది, తిరుగులేని ఆధిక్యతతో గెలుపొందిన పశ్చిమ గోదావరి జిల్లాలోని కూటమి అభ్యర్థులంతా నేడు శాసన సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇంతకు ముందే ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఆయన మంత్రి వర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పుడు శాసనసభలో ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఈ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. దీనికి గాను ఇప్పటికే అన్ని ఏర్పాట్లు జరిగాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో నలుగురు టీడీపీ పక్షాన, ముగ్గురు జనసేన పక్షాన గెలుపొందారు. వీరంతా అఖండ మెజార్టీలతోనే ప్రత్యర్థులను చిత్తుచేశారు. ఆచంట నుంచి పితాని సత్యనారాయణ, పాలకొల్లు నుంచి నిమ్మల రామానాయుడు, నరసాపురం నుంచి బొమ్మిడి నాయకర్, భీమవరం నుంచి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు), ఉండి నుంచి కనుమూరి రఘురామకృష్ణ రాజు, తాడేపల్లిగూడెం నుంచి బొలిశెట్టి శ్రీనివాస్, తణుకు నుంచి ఆరిమిల్లి రాధాకృష్ణ ఎమ్మెల్యేలుగా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కుటుంబసభ్యులు, శ్రేయోభిలాషులు, భారీ ఎత్తున తరలి వెళ్ళాలని భావించినా శాసనసభ ప్రాంగణంలో వున్న చోటు పరిమితంగా ఉండటంతో ప్రస్తుతానికి వీరికి ఆ అవకాశం లేకపోయింది. బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్ తొలిసారిగా అసెంబ్లీలో అడుగు పెడుతున్నారు.

ఎమ్మెల్యేలకు సవాళ్లు

శాసనసభ్యుల ఎదుట పెనుసవాళ్ళే ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అరాచకాలు, అవినీతి, డొంక తిరుగుడు, దారి మళ్లింపు, గండికొట్టిన, నిలిచిపోయిన పథకాలు ఇలా ఎన్నో అడుగడుగునా ఉన్నాయి. కూటమి ఎమ్మెల్యేలు తమకు సంతృప్తికరంగా సేవ చేయగలుగుతారన్న నమ్మకంతోనే ప్రజలంతా ఉన్నారు. వీరి ఆశలు, ఆశయాలకు అనుగుణంగా ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో చెమటోడ్చాల్సి ఉంది. మంత్రులుగా సమర్థులనే మంత్రి వర్గంలోకి తీసుకోవడం వారి (మిగతా 11లో పేజీలో)



కె.లంక ఛానల్ సమస్యను వివరిస్తున్న రైతులు

వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం

కాళ్ల మండలం రైతులకు కలెక్టరు హామీ

కాళ్ల(ఉండి), జూన్ 20: కాళ్ల మండల రైతుల సాగునీటి కష్టాలను వారం రోజుల్లో పరిష్కరించడానికి కృషి చేస్తానని కలెక్టరు సుమత్‌కుమార్ గాంధీ హామీ ఇచ్చారు. కాళ్లలో సార్వా ఆకుమడులు వేసుకోవడానికి నీరు లేకపోవడంతో రైతులు ఈ నెల 18న మంగళవారం కలెక్టరును కలిశారు. ఆయన తక్షణమే స్పందించి దీనిపై విచారణ చేయాలని జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి నాగేశ్వరరావును నియమించారు. గురువారం కాళ్ల (మిగతా 11లో పేజీలో)



పోలవరం మా బాధ్యత

- మంత్రిగా నిమ్మల బాధ్యతల స్వీకరణ

పాలకొల్లు, జూన్ 20 : రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరంతోపాటు జిల్లాలో ముఖ్యమైన ప్రాజెక్టులన్నింటికి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తామని ఏపీ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. గురువారం రాష్ట్ర సచివాలయం నాలుగో బ్లాక్‌లో ఆయన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గత ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కాల్వల్లో నీరు పారకుండా చేసింది. పంట కాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీతకు సంబంధించిన పనులపై తొలి సంతకం చేశా. వ్యవసాయ రంగానికి జీవం అందించే జలవనరుల శాఖను నాకు కేటాయించడం అదృష్టం. నాకు ఇచ్చిన బాధ్యతను నూరుశాతం న్యాయం చేస్తా. వైసీపీ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేసి రాష్ట్ర రైతులకు తీరని అన్యాయం చేసింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారు సహకారంతో ఐదేళ్లలో పోలవరం పూర్తి చేసి రాష్ట్ర ప్రజలకు బహుమతిగా ఇవ్వడం మా బాధ్యత. అలాగే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి రాష్ట్రాన్ని దేశంలోనే వ్యవసాయ రంగంలో మరో మెట్టుపైకి తీసుకెళ్తాం' అని చెప్పారు.

..అనే నేను

(Iవ పేజీ తరువాయి) స్థాయికి తగినట్లుగానే శాఖలు కేటాయించారు. జిల్లాలో కుంటుపడ్డ ప్రాజెక్టులను ముందుకు తీసుకు వెళ్లడానికి ఎమ్మెల్యేలు చిత్తశుద్ధితో ఉన్నారు. నిధులు రప్పించుకోవాలి. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలి. జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులు, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు, ఆక్వా యూనివర్సిటీ, పట్టణాలలో అమృత్ ప్రాజెక్టులు కీలకంగా ఉన్నాయి. ఆక్వా రంగ అభివృద్ధికి హామీ ఇచ్చారు. ఇవన్నీ నెరవేర్చే బాధ్యత వీరిపైనే వుంది. వీరిపైనే ప్రజలంతా భారీగా ఆశలు పెట్టుకున్నారు.

శాసనసభ్యులుగా నేడు పదవీ ప్రమాణం చేయనున్న ఎమ్మెల్యేలు అందరికి కూటమి పక్షాన నేతలు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఎందుకనంటే అధికారికంగా రేపటి నుంచే ఎమ్మెల్యేలంతా తమ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. తదనుగుణంగానే వీరందరికి ప్రభుత్వపరంగా అందాల్సినవన్నింటిని సమకూర్చబో తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రకటించిన అనేక పథకాలను వీరు తమ నియోజకవర్గాల్లో పర్యవేక్షించాల్సి ఉంటుంది. ప్రత్యేకించి ఈ నెలాఖరు నాటికే కొంతలో కొంత పాలనా యంత్రాంగం ఒక గాడిన పడే అవకాశం ఉన్నందున అధికారుల సమీక్షలకు కీలక నిర్ణయాలకు అవకాశం ఉండబోతోంది. నామినేటెడ్ పదవుల విషయంలోనూ వివిధ సిఫార్సులు అందుబాటులోకి వస్తాయి. నేడు ప్రమాణం చేయనున్న ఎమ్మెల్యే పక్షాన ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో కార్యకర్తలు, నేతలు సంబరాలు చేస్తూనే ఉన్నారు.

హామీల అమలే మా లక్ష్యం

ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు ఎమ్మెల్యే

నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమే నా ముందున్న లక్ష్యం. వైసీపీ ఐదేళ్ల పాలనలో తణుకు నియోజకవర్గం అభివృద్ధికి నోచు కోలేదు. అన్ని రంగాలు దెబ్బతిన్నాయి. దీనిని గాడిన పెట్టాలి. తణుకులో ఎంతో మంది ప్రజా ప్రతినిధులు అభివృద్ధే అజెండాగా పనిచేశారు. 2014-2019 మధ్య కాలంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నేను అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించా. ఇప్పుడు అలాంటి అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తా. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా వెనుకబడింది. గతంలో నేను ఎమ్మెల్యేగా వున్న సమయంలో జరిగిన అభివృద్ధి మినహా కొత్తగా చేసిందేమీ లేదు. గతంలో చేసిన పనులను ఇప్పటికి వినియోగంలోకి తేలేదు. వాటి పనుల పురోగతి నిలిచిపోయింది. ఇపుడు వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటా. ఐదేళ్ల వైసీపీ పాలనలో అవినీతి, దోపిడీ రాజ్యమేలడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎన్నో ఆశలతో ప్రజలు నన్ను భారీ మెజారిటీతో గెలిపించారు. రానున్న ఐదేళ్లు అభివృద్ధికి పెద్దపీట వేస్తా. ఇచ్చిన హామీలన్నీ నెరువేరుస్తా.

ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తా

బొలిశెట్టి శ్రీనివాస్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే

తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు భారీ ఆధిక్యతతో విజయం అందించారు. నా బాధ్యతను పెంచారు. వారి రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. నియోజకవర్గ ప్రజల ఆశలను, ఆకాంక్షలను నెరవేరుస్తాం. అవినీతి లేని అభివృద్ధి చేసి చూపిస్తాం. వైసీపీ సర్కారు పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేశారు. డ్రెయినేజీ వ్యవస్థ బాగాలేదు. రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఐదేళ్ల విధ్వంస పాలన మరిపించే విధంగా పట్టణంలో రెండో సమ్మర్ స్టోరేజీ, భూగర్భ డ్రెయినేజీతోపాటు రోడ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తాం. మండల గ్రామాలకు గోదావరి జలాలు అందిస్తాం. భీమవరం-తాడేపల్లిగూడెం రహదారి అభివృద్ధి చేయడంతోపాటు ఏళ్లనాటి సమస్యగా ఉన్న బోడపాడు వంతెన నిర్మాణాన్ని చేపడతాం.

ఆచంట అభివృద్ధికి కృషి

పితాని సత్యనారాయణ, ఆచంట ఎమ్మెల్యే

ఆచంట నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటా. గడిచిన ఐదేళ్లలో ఈ నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేకపోయింది. అన్ని వర్గాలు నష్టపోయాయి. ఆచంట ప్రజలు నాకు మరోసారి ఇచ్చిన అవకాశాన్ని అభివృద్ధి చేసేందుకు పూర్తిస్థాయిలో వినియోగిస్తాం. అత్యధిక నిధులు రాబట్టి అభివృద్ధి చేస్తాం

రోల్ మోడల్‌గా నిలుపుతా

పులపర్తి రామాంజనేయులు, భీమవరం ఎమ్మెల్యే

భీమవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా అభివృద్ధి చేస్తాం. మూడోసారి ఎమ్మెల్యేగా ప్రజలు ఆశీర్వదించారు. నియోజకవర్గ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా. ఔటర్ రోడ్డు, అమృత ప్రాజెక్టు, డ్రెయిన్లు, రహదారులు, అక్వా రంగాల అభివృద్ధి వంటివెన్నో చేయాల్సి ఉంది. డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతాం. తెలుగు దేశం, జనసేన, బీజేపీ కూటమిపై భీమవరం నియోజకవర్గ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం.

ఆక్వా మంచినీటి కి ప్రాధాన్యం

కనుమూరి రఘురామకృష్ణరాజు, ఉండి ఎమ్మెల్యే

ఉండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తా. ఇక్కడ ఆక్వా రంగం పూర్తిగా దెబ్బతింది. రైతులు దారుణంగా నష్టపోయారు. ఈ రంగానికి పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తా. నియోజకవర్గంలో డ్రెయిన్లన్నీ పూడుకుపోయాయి. వాటి తవ్వకాన్ని చేపడతాం. వాటర్ గ్రిడ్ పథకం ద్వారా గోదావరి జలాలను రప్పించి ప్రతీ ఇంటికి మంచినీళ్ళు అందించే బాధ్యత మాది.

తీరప్రాంతం అభివృద్ధే ధ్యేయం

బొమ్మిడి నాయకర్, నరసాపురం ఎమ్మెల్యే

నర్సాపురం నియోజకవర్గం తీరప్రాంతాలలో విస్తరించి ఉంది. ఇక్కడ ఎన్నో సమస్యలు తిష్ట వేశాయి. తీరప్రాంత ప్రజలకు మంచి నీళ్ళు లేవు. పట్టణంలో మౌలిక వసతులు లేకుండా పోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులన్నీ శంకుస్థాపనలకే పరిమితమయ్యాయి. వశిష్ట వారధి, ఆక్వా యూనివర్సిటీ, హార్బర్, ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. తీరప్రాంతాలకు మంచినీరు అందిస్తాం.

సంక్రాంతికి గృహప్రవేశాలు : మంత్రి పార్థసారధి

నూజివీడు, జూన్ 20: టిడ్కో ఇళ్లు కనీసం వెయ్యింటిని పూర్తిచేసి రానున్న సంక్రాంతికి లబ్ధిదారులతో గృహ ప్రవేశం చేయిస్తానని, గృహ నిర్మాణ శాఖా మంత్రి పార్థ సారధి స్పష్టం చేశారు. నూజివీడు పట్టణంలోని టిడ్కో ఇళ్ల గృహ సముదాయాన్ని గురువారం మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇళ్లను నిర్మించిన ఎల్‌అండ్‌టీ సంస్థతో తాను సంప్రదింపులు జరిపానని, వారు ఈ నిర్మాణాలు పూర్తి చేయటానికి అంగీకరించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. నూజివీడులో 2,800 గృహాలు 90 శాతం వరకు పూర్తి అయ్యాయన్నారు. లబ్ధిదారుల పేరుతో బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకున్న ప్రభుత్వం ఆ నిధులను దారి మళ్లించిందన్నారు. బ్యాంకుల నుంచి లబ్దిదారులకు మూడేళ్ల క్రితం రుణాలు చెల్లించాలంటూ నోటీసులు పంపారన్నారు. తమ పేరుతో ప్రభుత్వం తీసుకున్న రుణానికి తామెందుకు రుణాలు చెల్లించాలంటూ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారన్నారు. బ్యాంకర్ల నుంచి ఈ ప్రభుత్వం ఎన్ని వందల కోట్ల రుణం తీసుకుందో అనేది కొద్ది రోజుల్లో తేలుతుందన్నారు.

పెన్షన్‌దారులకు ఇన్‌కంటాక్స్ రికవరీ ఫారం-16 జారీ : రవివర్మ

భీమవరంటౌన్, జూన్ 20 :ఉప ఖజానా కార్యాలయం భీమవరం పరిధిలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఇన్‌కంటాక్స్ రికవరీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ఫారం-16ను గురువారం నుంచి జారీ చేశామని ఉప ఖజానా అధికారి అల్లూరి రవివర్మ తెలిపారు. సంబంధిత పింఛన్‌దారులు కార్యాలయం పనిచేసే సమయంలో పొందవచ్చన్నారు. గురువారం కార్యాలయంలో రిటైర్డ్ ఉద్యోగులకు ఫారం అందించి ఆయన మాట్లాడారు. ఏదైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు జేమ్స్ మాట్లాడుతూ రికవరీ చేయబడిన పెన్షనర్స్‌ఫారం-16ను తీసుకొని ఐటీ రిటర్న్‌లను వచ్చేనెల 31లోపు దాఖలు చేయాలని, సందేహాలుంటే పెన్షనర్స్ అసోసియేషన్ వారిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ ఎస్.సత్యనారాయణరాజు, భీమవరం యూనిట్ కార్యదర్శి పాకలపాటి సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, జీవీ సత్యనారాయణరాజు, జేవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏయూ భాస్కరరావు, అప్పన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం

(Iవ పేజీ తరువాయి) పంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో ఆయన సమావేశం నిర్వహించి సమస్య లను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.లంక ఛానల్ పరిశీలించినట్టు నాగేశ్వరరావు తెలిపారు. ప్రధానంగా రొయ్యలు చెరువుల నీరును పంట కాలువలోకి విడిచి పెట్టడం ఉప్పు నీరు, బోర్లు వల్ల తాగునీరు కలుషితం అవుతుందని దీనిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భీమవరంలోని రైతులు అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వ హించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉండి నుంచి ప్రధాన కాలువ పూడుకుపోవడంతో సాగునీరు శివారు ప్రాంతానికి రావడం లేదని తక్షణమే కాలువ పూడికతీత పనులను చేపట్టాలని ఇరి గేషన్ అధికారులకు సూచించారు. కెలంక ఛానల్‌ను పరిశీలించిన అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. రైతుల సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టరు తెలిపారు.


పట్టుబడిన బియ్యం లారీలు (ఫైల్ ఫొటో)

చీకటి దందాకు రైట్ రైట్

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా బియ్యం ఎగుమతులు మాత్రం తగ్గలేదు. రాత్రి సమయాల్లో లారీలు తీరం నుంచి సరిహద్దు జిల్లా దాటుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొంత మంది బ్రోకర్లు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి వాటిని కాకినాడకు తరలిస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా లారీలు తక్కువ సంఖ్యలోనే తరలిపోతున్నాయి. ఇవి కూడా అర్ధరాత్రి సమయాల్లోనే. తీరంలో ఎక్కడా తనిఖీలకు చెక్ పోస్టులు అంటూ లేవు. ప్రస్తుతం 216 జాతీయ రహదారి పూర్తయి ట్రాఫిక్ పెరిగినా పోలీస్ నిఘా మాత్రం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే చీకటి దందాలకు తీర ప్రాంత రహదారి అడ్డాగా మారింది.

- కాకినాడ పోర్టు.. వయా నరసాపురం
- కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా
- గత ప్రభుత్వ హయాంలో సాగిన దందా
- ఇప్పటికీ మారని తీరు

నరసాపురం, జూన్ 20: గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన రేషన్ బియ్యం అక్రమ రవాణకు ఇంకా చెక్ పడలేదు. ప్రభుత్వం మారినా ఇంకా చీకటి దందా కొనసాగుతూనే ఉంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి రాత్రి సమయాల్లో బియ్యం లారీలు యథేశ్చగా జిల్లా సరిహద్దు దాటి కాకినాడకు వెళ్లిపోతున్నాయి. అక్కడ నుంచి పోర్టు ద్వారా విదేశాలకు తరలిస్తున్నారు. ఈ అక్రమ దందా వైసీపీకి చెందిన ఓ మాజీ నేత కనుసన్నల్లోనే ఇంకా సాగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కొవిడ్ సమయంలో కేంద్ర ప్రభుత్వం తెల్లకార్డు దారులకు ఉచితంగా 20 కేజీల రేషన్ బియ్యం అందించింది. దాదాపు ఏడాదిపాటు ఈ బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో మాదిరిగానే రేషన్ బియ్యం ఇచ్చింది. అయితే ఎక్కువ మంది ఈ బియ్యాన్ని తినేందుకు ఇష్టపడలేదు. బయట మార్కెట్‌లో అమ్ముకున్నారు. వాటిని కొంత మంది బ్రోకర్లు కొనుగోలు చేసి కాకినాడకు తరలించారు. మొదట్లో అంతా రైస్ మిల్లర్లకు తరిస్తున్నారని భావించారు. అప్పటి అధికార పార్టీకి చెందిన ఓ ముఖ్య నేత ఈ బియ్యాన్ని కాకినాడ పోర్టు నుంచి ఎగుమతి చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో లారీలు జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మీదుగా చించినాడ మీదుగా కోనసీమకు వెళ్లాయి. ఈ దందా అంతా రాత్రి సమయాల్లోనే సాగింది. అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో అప్పట్లో ఈ లారీలను పెద్దగా పట్టించుకోలేదు. అడపదడపా ఒకటి రెండు లారీలు పట్టుకుని చేతులు దులుపుకునేవారు.



ఎమ్మెల్యే ధర్మరాజుకు హార్టీకల్చర్ వర్సిటీ వీసీ సత్కారం

ఉంగుటూరు, జూన్ 20 :వెంకట్రామన్నగూడెం హార్టీకల్చర్ విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ జానకీరామ్, సిబ్బంది గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయంలోని పరిస్థితులు, కావాల్సిన నిధులు, సౌకర్యాలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేను జంగారెడ్డిగూడెం సమీపంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయ ఈవో, ఆలయ అర్చకులు మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు.

దేవదాయ శాఖ మంత్రికి శ్రీవారి ఆశీర్వచనం



ద్వారకాతిరుమల, జూన్ 20: రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని శ్రీవారి ఆలయ అధికారులు, అర్చకులు సచివాల యంలోని ఆయన చాంబర్‌లో గురువారం కలసి సత్కరించారు. ముందుగా ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనాన్ని అందించారు. అనంతరం ఆలయ ఈవో త్రినాథరావు ఆయనకు పుష్పగుచ్ఛాన్ని, శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.



రెవెన్యూడే సందర్భంగా కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న డీఆర్ ఉదయభాస్కరరావు, అధికారులు

ప్రజలకు మంచి సేవలు అందించాలి

» జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కరరావు

భీమవరం టౌన్, జూన్ 20 : ప్రజలకు మంచి సర్వీసులను అందించడానికి రెవెన్యూ ఉద్యోగులు ఎల్లప్పుడూ కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు అన్నారు. గురువారం రెవెన్యూ డే వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేయడం గర్వపడాల్సిన విషయమన్నారు. రెవెన్యూ శాఖ ఒక వ్యవస్థ అని, ఎప్పటికప్పుడు ఉద్యోగులు అవగాహన పెంచుకోవాల్సి ఉంటుందన్నారు. తెలియని విషయాలు నేర్చుకోవడంలో చిన్న, పెద్ద ఉద్యోగి అనే భావన ఉండ కూడదన్నారు. ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రెవెన్యూశాఖ ప్రజలకు అందిస్తున్న సేవలు, భూవ్యవహారాలు, వివిధ ప్రయోజనాల కోసం అందించే ధృవీకరణ పత్రాలు, నీటి పన్నుతో సహా పలు అంశాలపై అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ పరిపాలనా అధికారి పి.పాపారావు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని నేర్చుకుంటే గుర్తింపు ఉంటుందని, శాఖకు సంబంధించి ప్రతీ విషయాన్ని క్షుణంగా నేర్చుకోవాలన్నారు. ప్రజలకు రెవెన్యూ శాఖపై నమ్మకం కలిగే విధంగా ఉండాలన్నారు. రెవెన్యూ శాఖను ఉన్నతికి, అభివృద్ధికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు తహసీల్దార్ లక్కు నరసింహారావును పూలమాలలతో సన్మానించారు. జిల్లా రెవెన్యూ అధికారి చేతుల మీదగా కేకును కట్ చేశారు. జిల్లా కలెక్టరేట్ సూపరింటెండెంట్లు చందన దుర్గాప్రసాద్, రవికుమార్, కృష్ణారావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

రెవెన్యూ ఉద్యోగులకు చట్టాలపై విస్తృత అవగాహన ఉండాలి

ఏలూరు ఎడ్యుకేషన్, జూన్ 20 : భారతదేశంలో 1786లో తొలిసారిగా బోర్డ్ ఆఫ్ రెవెన్యూ ఆవిర్భావం పురస్కరించుకుని ఏటా జూన్ 20న జరుపుకునే రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం ఏలూరులోని రెవెన్యూ భవన్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల నుంచి రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు, రిటైర్డ్ ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏలూరు ఆర్డీవో ఖాజావలీ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ చరిత్ర, విశిష్టతను వివరించారు. ఎప్పటికప్పుడు ప్రజలకు మరిన్ని మంచి సేవలను అందించేలా చట్టాలపై విస్తృత అవగాహన ఉండాలని సూచించారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘ కార్యదర్శి ప్రమోద్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు రెవెన్యూ ఉద్యోగులు సరిహద్దులో సైనికునివలే అలుపెరుగని సేవలను ప్రజలకందించాలన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు చట్టాలపై అవగాహన కోసం ఏలూరు కేంద్రంగా త్వరలోనే ఓ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి జరుగుతోందన్నారు. ఉద్యోగకాలంలో అత్యుత్తమ సేవలందించిన రిటైర్డ్ తహసీల్దార్లు వి.వి.జగన్మోహనరావు, ఎం.హెచ్.మణి, బి.బెన్నీ, ఎస్.సత్యనారాయణ, జి.జే.ఎస్.కుమార్, రామకృష్ణ, ఆర్.పోతురాజు, సీతారాం, రిటైర్డ్ ఆఫీస్ సబార్డినేట్ రాఘవులును ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు కె.రవిచంద్ర, మాధవి, శ్రీనునాయక్, మల్లేశ్వ రరావు, ప్రసాద్‌బాబు, కృష్ణస్వామి, బలుసు గీతిక, గ్రామ రెవెన్యూ అధికారులు, వార్డు రెవెన్యూ కార్యదర్శులు, గ్రామ సర్వే సహాయకులు పాల్గొన్నారు.



రెవెన్యూ దే వేడుకల్లో రెవెన్యూ ఉద్యోగులు, రిటైర్డ్ తహసీల్దార్లు

మంత్రిని కలసిన రెవెన్యూ అధికారులు



ఏలూరు రూరల్, జూన్ 20 : అమరావతిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనగాని సత్యప్రసాద్‌ను సచివాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో నాయకులు కలిసి సత్కరించి అభినందించారు. రెవెన్యూ ఉద్యోగులు, వీఆర్వోల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అనంతరం జలవనరుల శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నిమ్మల రామానాయుడిని కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, ఎ.మౌళీ బాషా, ఎం.లక్ష్మీనారాయణ, మద్దాల బాపూజి, ప్రసన్నలక్ష్మి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వెంకటేశ్వర జ్యూయలరీ మార్ట్	సూర్య జ్యూయలర్స్	శ్రీ సాయిరామ్ జ్యూయలర్స్	శ్రీ సత్యనారాయణ జ్యూయలర్స్	వైభవ్ జ్యూయలర్స్
వాసవి జ్యూయలరీ మార్ట్	శ్రీ వాసవి జ్యూయలరీ మార్ట్	రమేష్ జ్యూయలర్స్	లక్ష్మి వెంకటేశ్వరా జ్యూయలర్స్	సిద్దేశ్వర జెమ్స్ & జ్యూయలర్స్
ఎన్.ఎస్.ఎన్. జ్యూయలర్స్	ఐశ్వర్యా జ్యూయలర్స్	శ్రీ మహాలక్ష్మి జ్యూయలర్స్	శ్రీ న్యూ వెంకటేశ్వర జ్యూయలర్స్	శ్రీ కోదండరామా జ్యూయలర్స్
కుమార్ జ్యూయలర్స్	కోట్ల జ్యూయలర్స్	శ్రీ రామ్ ప్రసాద్ జ్యూయలర్స్	బుల్లిస్వామి జ్యూయలర్స్	శ్రీ ధనలక్ష్మి జ్యూయలర్స్
దేవి జ్యూయలర్స్	రామాంజనేయ జ్యూయలర్స్	శ్రీ సాయికృష్ణ జ్యూయలర్స్	శ్రీ రుక్మిణి జ్యూయలర్స్	శ్రీ శ్రీనివాస జ్యూయలర్స్
శ్రీ రాజ రాజేశ్వరి జ్యూయలర్స్	దుర్గా జ్యూయలర్స్	వరలక్ష్మి జ్యూయలర్స్	వైష్ణవి జ్యూయలర్స్	పవన కళ జ్యూయలర్స్
ప్రియాంక జ్యూయలర్స్	అంజలి జ్యూయలర్స్	కంచి కామాక్షి జ్యూయలర్స్	యింకూలు జ్యూయలర్స్	మోహన్ జ్యూయలర్స్
వి.ఎస్.ఎన్. జ్యూయలర్స్	కార్తీకేయ జ్యూయలర్స్	హరి శ్రీరామా జ్యూయలర్స్	స్వర్ణ జ్యూయలర్స్	జై సంతోషి మాత జ్యూయలరీ వర్క్స్
కోమల సిల్వర్స్ షాపు	జి.ఎమ్.ఆర్. సిల్వర్స్ & పెరల్స్	నీలం కిరణ్ జ్యూయలర్స్	మురళీకృష్ణ జ్యూయలర్స్	శ్రీ వసుధ జ్యూయలర్స్
శ్రీ భాస్కరా జ్యూయలర్స్	లోకేష్ జ్యూయలర్స్	రత్నం జ్యూయలర్స్	కె.జి.ఆర్. జ్యూయలర్స్	చలంచర్ల మోహన్‌రావ్ ఫైనాన్స్
యింకూలు నాగేశవరరావు ఫైనాన్స్	అక్షయ జ్యూయలర్స్	లక్ష్మి గణపతి ఎలక్ట్రానిక్ కాటా ద్రావకం షాపు	శేర్ దిలీప్ ద్రావకం షాపు	శశి ఎలక్ట్రానిక్ ధర్మకాటా ద్రావకంషాపు (నారాయణ)
శేర్ బాలు ద్రావకం షాపు	ఇప్పిలి మల్లేశ్వరరావు ద్రావకం షాపు (రాంబాబు)	రాజేష్ ద్రావకం షాపు	కూర్మినాయుడు ద్రావకం షాపు	శ్రీ లక్ష్మి జ్యూయలర్స్
భాగ్యలక్ష్మి సిల్వర్స్ & జ్యూయలరీ మార్ట్	శ్రీ తేజ సిల్వర్స్ & జ్యూయలరీ మార్ట్	సాయి సిల్వర్స్	జగదీష్ జ్యూయలర్స్	శ్రీ దుర్గా జ్యూయలర్స్
అక్షర జ్యూయలర్స్	నాయుడు జ్యూయలర్స్	వెంకటరమణ ద్రావకం కొట్టు	బాలనారాయణ ద్రావకం కొట్టు	
శ్రీ సాయిబాలాజీ జ్యూయలరీ మార్ట్	శ్రీ లక్ష్మి దత్త జెమ్స్ & జ్యూయలరీ	సాయిరామ్ జ్యూయలరీ మార్ట్	హిమాన్స్ జ్యూయలర్స్	